క్లుప్తంగా

9న అవనిగడ్డలో జాబ్‌మేళా

అవనిగడ్డ: గ్రామీణ యువజన వికాస సమితి, అంజనాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన అవనిగడ్డ గాంధీక్షేత్రంలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, ఫౌండేషన్ చైర్మన్ బచ్చు నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, టాటా టెక్నాలజీస్, స్పైడర్ ఎలక్ట్రిక్, సుప్రజిత్ ఇంజినీరింగ్, మదర్ సన్ సుమి సిస్టమ్స్, అంబెనాల్, రిలయన్స్ డిజిటల్ వంటి కంపెనీల్లో 800కు పైగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన వారు ఈ జాబ్‌మేళాకు హాజరు కావచ్చని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 92906 89808 నంబర్‌కు ఫోన్ చేసి వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

నేటి నుంచి వారాహి నవరాత్రోత్సవాలు

కె.కొత్తపాలెం(మోపిదేవి): కృష్ణానది ఒడ్డున మండలంలోని కె.కొత్తపాలెం గ్రామంలో ఉన్న శ్రీదుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయంలో వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విద్యాసాగర్ శర్మ మాట్లాడుతూ ఈ మహోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ ఉంటుందని తెలిపారు. 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారని చెప్పారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం



అవనిగడ్డ: స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన బచ్చు నాగరాజును శుక్రవారం బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఘనంగా సత్కరించారు. స్థానిక బ్రాంచి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ భోగాది సుబ్రహ్మణ్యేశ్వరరావుతో పాటు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామికి విశేష పూజలు



వేకనూరు(అవనిగడ్డ): మండల పరిధిలోని వేకనూరులో వేంచేసియున్న సూర్యనారాయణస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యేష్ఠ బహుళ అమావాస్యను పురస్కరించుకుని ఆగమ పండితులు దీవి బాలకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామివారికి విశేష అలంకారం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు పర్యవేక్షించారు.

జాగ్రత్తలు తీసుకుంటే మామిడి, కొబ్బరి సాగులో లాభాలు



కృత్తివెన్ను: తగిన జాగ్రత్తలు తీసుకుంటే మామిడి, కొబ్బరి సాగులో మంచి లాభాలు గడించవచ్చని ఉద్యాన శాఖాధికారి మానస అన్నారు. మండల పరిధిలోని చినగొల్లపాలెం దీవిలో శుక్రవారం ఉద్యాన తోటల పెంపకాన్ని ఆమె పరిశీలించారు. సన్నకారు రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సహిస్తున్న మామిడి, కొబ్బరి సాగు భూములను ఆమె పరిశీలించారు. అనంతరం సచివాలయం వద్ద రైతులతో సమావేశమై సాగులో మెలకువలు వివరించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ కోసం రైతులు అవలంబించాల్సిన పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీల్, ఎంపీటీసీ సభ్యులు సాధనాల బాబ్జీ, ఎఫ్‌ఏ ఫ్రాన్సిస్, రైతులు ఉన్నారు.

ఆటో బోల్తా : డ్రైవరుకు తీవ్ర గాయాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని నారాయణపురం–పెదపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన ఆటో ప్రమాదంలో డ్రైవరు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని ములపర్రు గ్రామానికి చెందిన సుభాష్ చంద్రబోస్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి ఉల్లిపాయలు లోడు చేసుకుని పెదపట్నం వైపు వెళుతుండగా నారాయణపురం గ్రామ శివార్లలో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి 108 ద్వారా బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసు వారికి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ వాసు తెలిపారు.

హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ



మోపిదేవిలో విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోపిదేవి: హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు హాస్టల్ ఏర్పాటుకు కృషిచేస్తానని అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. మండల కేంద్రం మోపిదేవి జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం జయంతి అధ్యక్షతన శుక్రవారం విద్యార్థులకు కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు ప్రయోజనం కల్పించే ఈ అంశాన్ని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామన్నారు. నియోజకవర్గ స్థాయిలో మోపిదేవి జెడ్పీ పాఠశాల మొదటి నుంచి ఆదర్శ పాఠశాలగా గుర్తింపు ఉందని, ఇక్కడ స్థానికులు–పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో ఉపాధ్యాయులు ఉన్నతమైన విద్య అందిస్తారని అభినందించారు. సమాజంపై ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉంటారనిఅన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి వారు కూడా మాతృభాషలోనే చదివి ఉన్నతులు కాగలిగారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యారంగానికి అధిక ప్రాధాన్యం కలిపిస్తూ చదువుకునే ప్రతి పిల్లవాడికి రూ.15 వేలు అందిస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు మాట్లాడుతూ పాఠశాలలో చదివే బాలికలు ఇదే హైస్కూల్ ప్లస్‌లో చేరి కళాశాల ఉన్నతికి సహకరించాలని సూచించారు. హెచ్‌ఎం జయంతి మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య 450 మందికి పైగా ఉన్నందున భోజనశాల విస్తరణకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం విద్యార్థులకు కిట్స్ అందజేశారు. అనంతరం తొలిసారిగా పాఠశాలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూల దండలతో ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి ఎంపీపీ నడకుదుటి జనసీకుమారి, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, ఉప సర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, ఎంపీటీసీ–2 కొమ్ము పవన్‌కుమార్, పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు రావి ప్రభుదాస్, కార్యదర్శి కావూరి కోదండరామయ్య, ఎంఈవో దుర్గాసాగర్, తహసీల్దార్ శ్రీవిద్య, ఎంపీడీవో రామలింగేశ్వరావు, నడకుదుటి జనార్దనరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ



చల్లపల్లిలో విద్యార్థినికి కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి(అవనిగడ్డ): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక పంచాయితీ పరిధిలోని నారాయణరావునగర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 640 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శుక్రవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో బాలికలు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే ఇంకా మంచి ఫలితాలు సాధిస్తారని చెప్పారు. నూరు శాతం ఫలితాలు సాధించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ విజ్ఞప్తి మేరకు గురుకుల పాఠశాల రహదారి, నూతన తాగునీటి బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల శివ, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నబీ ఘోరీతో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మంత్రి మనోహర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

కోనేరుసెంటర్: గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా చేపట్టిన ఇంటింటికీ రేషన్ కార్యక్రమం వలన ప్రభుత్వానికి నష్టం వస్తుందంటూ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని దళిత బహుజన పరిరక్షణ సంఘం కార్యదర్శి యెగ్గోని గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని కోట్లాది మంది పేద ప్రజల కోసం గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిస్పెన్సింగ్ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయటం వలన రేషన్ దుకాణాల వరకు వెళ్లలేని అనేకమంది ఇంటి వద్ద సరుకులు పొంది ప్రభుత్వం తరఫున ఎంతో సహాయాన్ని పొందారన్నారు. అలాంటి పేద ప్రజలను దృష్టిలో పెట్టుకోకుండా కేవలం లాభనష్టాలతో బేరీజు వేసి రేషన్ పంపిణీ వాహనాల ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. అనాదిగా అవినీతి, అక్రమాలు, లంచగొండితనంతో భ్రష్టుపట్టిన ప్రభుత్వ వ్యవస్థలను ప్రక్షాళన చేసి పేద వర్గాలకు ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేస్తూ పారదర్శక పాలనలో భాగంగా గడప వద్దకే ప్రభుత్వ సేవలు అందించటం కోసం 2.70 లక్షల మంది వలంటీర్‌లతో కూడిన గ్రామ వలంటీర్ వ్యవస్థను ప్రారంభించి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తే ఓర్వలేక మంత్రి మనోహర్ ఎండీయూ వాహనాలను రద్దు చేసేందుకు నిర్ణయించటం సహేతుకం కాదన్నారు. మంత్రి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ముందు జాగ్రత్తలతో అతిసారం దూరం

కోనేరుసెంటర్: గ్రామీణ ప్రాంతాలలో అతిసార వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం మంచిదని చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జె.పావని తెలిపారు. మండల పరిధిలోని ఎస్.గొల్లపాలెంలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లో శనివారం అతిసారపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆహారం విషయంలో పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చిన్నపిల్లల్లో వచ్చే అతిసార వ్యాధిని నియంత్రించేందుకు వైద్య సిబ్బంది ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లు, జింక్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పిల్లలు పుట్టిన నాటి నుంచి షెడ్యూల్ ప్రకారం ఐదు సంవత్సరాలలోపు వేయించవలసిన అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కె.మురళి, జిల్లా ఆరోగ్య విద్య బోధకుడు బి.రాజేంద్రకుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పీవీ పరమేశ్వరరావు, సీహెచ్ వసుంధర దేవి, ఎస్.రాంబాబు, ఎంపీ మోహనరావు, ప్రసన్నాంబ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన బుద్ధప్రసాద్



పులిగడ్డ అక్విడెక్టుని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: వనమహోత్సవ కార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. మండల పరిధిలోని పులిగడ్డ ఎల్‌ఎఫ్‌ఆర్ ప్రాంతంలో కరకట్టకు ఇరువైపులా వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా చెట్లు పెంచే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతలు చేపట్టాలన్నారు. అనంతరం పులిగడ్డ అక్విడెక్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అతిథి గృహంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ డీఈ రావెళ్ళ రవికిరణ్, డ్రైనేజీ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, అటవీశాఖ డెప్యూటీ రేంజ్ అధికారి ఏఎల్ అరుణ్‌కుమార్, స్వచ్ఛ సుందర చల్లపల్లి నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల విస్తరణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

పులిగడ్డ శివారు అవనిగడ్డ మండల పరిధిలోని పాతకోట ఎస్సీ కాలనీలో విద్యుత్ లైన్ల విస్తరణ పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా పాతకోటలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించిందని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈ సుబ్రహ్మణ్యం, ఏఈలు చిరంజీవి, కె.శ్రీరామ జనార్దన్, కె.హరీష్, రవితేజ, డి.విజయ్, ఏపీవో రవికుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి అనుమతుల తర్వాతే విక్రయించాలి

- మొవ్వ ఏడీఏ శ్యామల
- శ్రీకాకుళం, కొడాలి గ్రామాల్లో రూ.3 లక్షల విలువైన 22.45 టన్నుల ఎరువుల విక్రయాల నిలుపుదల



శ్రీకాకుళంలోని ఫెర్టిలైజర్స్ షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్యామల, ఏవో మురళీ కృష్ణ

శ్రీకాకుళం(ఘంటసాల): వ్యవసాయ శాఖ ద్వారా పూర్తి స్థాయి అనుమతులు పొందిన తర్వాతే రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులను హెచ్చరించారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, కొడాలి గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులను మొవ్వ ఏడీఏ శ్యామల, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పూర్తి స్థాయి అనుమతుల్లేకుండా నిల్వ ఉన్న రూ.3,00,240 విలువైన 22.45 టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. అనంతరం ఏడీఏ శ్యామల మాట్లాడుతూ శ్రీకాకుళం, కొడాలి గ్రామాల్లోని ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులు ఎరువులకు సంబంధించి పూర్తిస్థాయి అనుమతి పత్రాలను అందజేసిన తర్వాతే సదరు ఎరువులను రైతులకు విక్రయించాలని, అప్పటివరకు ఎలాంటి అమ్మకాలు చేయొద్దని ఆదేశించినట్లు చెప్పారు. ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులు విక్రయించే ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి పూర్తి వివరాలతో బిల్లులను తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలన్నారు. షాపుల వద్ద స్టాకు బోర్డు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు స్టాకు, ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. పూర్తిస్థాయి అనుమతులు ఉన్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే రైతులు అమ్మాలని షాపుల యజమానులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో వీఏఏలు జి.దయానా, జి.రవిచంద్ర పాల్గొన్నారు.

బసవయ్య–రత్నమాంబ ట్రస్టు సేవలు అభినందనీయం



ఘంటసాల: తల్లిదండ్రులు బసవయ్య–రత్నమాంబ పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎన్నారై గొర్రెపాటి రంగనాథ్ బాబు అన్నారు. ఘంటసాల గ్రామానికి చెందిన గొర్రెపాటి బసవయ్య – రత్నమాంబ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వాహకులు గొర్రెపాటి వెంకట రంగారావు, గొర్రెపాటి వెంకట నరసింహారావు (చంటి బాబు) మండల పరిధిలోని మల్లంపల్లి పంచాయతీ శివారు బోళ్లపాడు గ్రామంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఏటా ఆర్థిక సాయం అందిస్తారు. దీనిలో భాగంగా గత మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన గ్రామానికి చెందిన లోయ జగదీష్ తల్లిదండ్రులకు ట్రస్టు తరఫున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఎన్నారై రంగనాథ్ బాబు చేతుల మీదగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మిల్క్ సొసైటీ ప్రెసిడెంట్ గొర్రెపాటి సురేష్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, కొండపల్లి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న అన్నపరెడ్డి వీరకుమారికి నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.కోటేశ్వరరావు పర్యవేక్షణలో గుంటూరు జిల్లాలో కోళ్ల పెంపకం సమస్యలు, అవకాశాలు అనే అంశంపై వీరకుమారి చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ పొందిన వీరకుమారిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రామాలయంలో చోరీ

గూడూరు: మండలంలోని తరకటూరు గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో దొంగలు పడ్డారు. గురువారం రాత్రి సమయంలో గుడి తాళాలు పగలగొట్టిన దుండగులు ఆలయంలోని స్వామి వార్లకు చెందిన వెండి ఆభరణాలు ఎత్తుకు వెళ్లారు. ఉదయం స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి వచ్చిన అర్చకుడు బృందావనం ఆది శేషాచార్యులు ఆలయ తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వగా, కమిటీ సభ్యుడు గళ్లా మురళీ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు ఎస్‌ఐ ఐ.వీర్రాజు, సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చి ఆధారాలు సేకరించారు. దేవతామూర్తులకు చెందిన 8 వెండి కిరీటాలు, వెండి పళ్లాలు, శఠగోపురం, మంగళసూత్రాలు వంటి దాదాపు 4 కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సంస్థ యాప్ ద్వారా బిల్లులు చెల్లించండి



మాట్లాడుతున్న ఈఈ భాస్కరరావు

మచిలీపట్నంటౌన్: విద్యుత్ వినియోగదారులు బిల్లులను విద్యుత్ సంస్థ యాప్ ద్వారా చెల్లింపులు చేయాలని ఆ సంస్థ మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు సూచించారు. నగరంలోని భాస్కరపురంలో శుక్రవారం రాత్రి వినియోగదారులకు యాప్ ద్వారా బిల్లుల చెల్లింపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఇకపై యుపీఐల ద్వారా కాకుండా ఏపీసీపీడీసీఎల్ సంస్థ రూపొందించిన యాప్, వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే బిల్లులు చెల్లించాలన్నారు. ప్లే స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులువుగా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చునన్నారు. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్ పే వంటి యూపీఐ యాప్‌ల ద్వారా కాకుండా తమ సంస్థ యాప్ ద్వారా నేరుగా చెల్లించాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఏడీఈ రామకృష్ణ, ఏఈ రమణ పాల్గొన్నారు.

సుల్తానగరంలో కలెక్టర్ పర్యటన

- తాగునీటి సరఫరా తీరుతెన్నులపై ఆరా
- నీరు పచ్చగా వస్తోందని ప్రజల ఫిర్యాదు
- ఇళ్లల్లో నుంచి శాంపిల్స్ తెప్పించి పరిశీలించిన కలెక్టర్
- మంచినీటి ట్యాంకులన్నీ శుభ్రం చేయించాలని ఆదేశం



సుల్తానగరంలో తాగునీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

కోనేరుసెంటర్: తాగునీటి సరఫరా విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. బందరు మండలంలోని సుల్తానగరం గ్రామంలో శుక్రవారం ఆయన తాగునీటి సరఫరా తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి సరఫరా ఎలా జరుగుతుందన్న విషయంపై గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామానికి తాగునీరు పరిశుభ్రంగా సరఫరా అవుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తాగునీటి ట్యాంకు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. అందుకు గ్రామస్తులు పలువురు బదులిస్తూ రెండు రోజులు నీరు బాగుంటే మిగతా రోజుల్లో పచ్చగా వస్తుందని చెప్పటంతో కలెక్టర్ గ్రామస్తుల ఇళ్లల్లో నుంచి ఆ నీటిని లోటాలో రప్పించి పరిశీలించారు. నీరు పచ్చగా ఉండటంతో వెంటనే సదరు నీటిని ప్రయోగశాలకు పంపి పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్ని ట్యాంకులు ఉంటే అన్ని ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆదేశించారు. ట్యాంకులను శుభ్రం చేసే ఫొటోలను ఎప్పటికప్పుడు తనకు పంపించాలని చెప్పారు. తాగునీరు సరఫరా అయ్యే పైపులకు ఎక్కడైనా లీకులు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రజలు అతిసార వ్యాధి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ



నాగాయలంకలో ఆరోగ్య అవగాహన ర్యాలీ ప్రారంభించిన నాగాంజనేయులు, ఆరోగ్య సిబ్బంది

నాగాయలంక: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో డయేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాకాలంలో వాతావరణంలో మార్పులు సంభవించిన నేపథ్యంలో నాగాయలంక–ఒకటి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ పరిధిలో వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నినదిస్తూ ర్యాలీ జరిపారు. మత్స్యకార సంఘం అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం బోస్‌బొమ్మ కూడలిలో హెల్త్ సెంటర్ ఏఎన్‌ఎం కోలా భాగ్యశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీ పామర్తి రమ్యశ్రీ మాట్లాడుతూ భారత ప్రభుత్వ వైద్యరంగ సంస్థ అయిన నేషనల్ హెల్త్ మిషన్ మార్గదర్శకాలను అతిసార వ్యాధి, సీజనల్ రోగాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. జ్వరం, స్పృహ కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం సమీప పీహెచ్‌సీకి వెళ్లి వైద్యం పొందాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. నాగాయలంక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని భావదేవరపల్లి హెల్త్ సెంటర్ పరిధిలో ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సమావేశాలు జరిపారు.

నేడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు

మచిలీపట్నంటౌన్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ శనివారం నగరంలోని రైతుబజారు పక్కనున్న పశువుల వైద్యశాలలో కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్నట్లు వైద్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంపుడు కుక్కలు, పిల్లులకు ఈ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నగరంలోని కుక్కలు, పిల్లుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోపిదేవిలో...

మోపిదేవి: మోపిదేవి వెటర్నరీ వైద్యశాలలో శనివారం ఉదయం 9 గంటలకు పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్ తెలిపారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: మండలంలోని బంటుమిల్లి, పెద తుమ్మిడి, అర్తమూరు గ్రామాల్లోని పశువుల ఆసుపత్రుల వద్ద శనివారం కుక్కలకు వ్యాక్సిన్(టీకాలు) ఉచితంగా వేస్తారని స్థానిక పశు వైద్యాధికారి స్ఫూర్తి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందని, కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు

నాగాయలంక: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని నాగాయలంక మండలంలో శనివారం పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సాయిమౌనిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంక పశువైద్యశాల, భావదేవరపల్లి, తలగడదీవి, సంగమేశ్వరం, ఎదురుమొండి గ్రామీణ పశుగణాభివృద్ధి కేంద్రాల్లో, అన్ని రైతు సేవా కేంద్రాల్లో టీకాలు ఉచితంగా వేస్తామని, తెల్ల పశువుల్లో వస్తున్న ముద్దచర్మ వ్యాధి సంబంధిత టీకాలు వేసేందుకు కూడా ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు.

ఎన్నారై రంగనాథబాబును సత్కరించిన ఎమ్మెల్యే



ఎన్నారై రంగనాథ్ బాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

ఘంటసాల: గొర్రెపాటి విద్యా ట్రస్టు ద్వారా విద్య, సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తున్న ఎన్నారై గొర్రెపాటి రంగనాథ్ బాబు ఆదర్శనీయులని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల గ్రామంలోని ఆయన నివాసంలో శుక్రవారం రంగనాథ్ బాబును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ గొర్రెపాటి విద్యాట్రస్టు స్థాపించి గ్రామాభివృద్ధితో పాటు విద్యాదానం చేస్తున్న రంగనాథ్ బాబు సేవలను కొనియాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి తన వంతు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, ట్రస్టు ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, మిల్క్ సొసైటీ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి వెంకట నరసింహారావు (చంటిబాబు) పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తులకు మరిన్ని సదుపాయాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులందరికీ అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఈవో కెఎస్. రామరావు తెలిపారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులో కొండపైకి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన కుళాయిలను శుక్రవారం ఈవో ప్రారంభించారు. ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకునే భక్తులు కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వీలుగా కుళాయిలను ఏర్పాటు చేశామని చెప్పారు. లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన ఈవో పలు సూచనలు చేశారు.

నేడు మునిసిపల్ సాధారణ సమావేశం

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ సాధారణ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశ మందిరంలో 12 అంశాలతో కూడిన అజెండాపై చర్చించనున్నట్లు తెలిపారు. అయితే మాజీ కౌన్సిలర్లు మోదుగుమూడి శేషుబాబు, ఆకునూరి నారాయణరావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఈ సమావేశంలో తొలుత వీరిద్దరి మృతికి కౌన్సిల్ సంతాపం తెలపనుంది. అనంతరం సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేసే అవకాశం ఉందని తెలిసింది.